సాక్షి చిత్తూరు


బుధవారం । 20 । డిసెంబర్ । 2023



న్యూ ఇయర్‌కు పకడ్బందీ ఏర్పాట్లు
కాణిపాకం ఆలయంలో భక్తుల సౌకర్యార్థం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని చైర్మన్ ఆదేశించారు. - 8లో



అభ్యసన 'మెరుగు'!
పేద విద్యార్థులను పోటీ ప్రపంచానికి దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. - 8లో



శ్రీవారి దర్శనానికి 12 గంటలు
తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టికెట్ లేని భక్తులకు 12 గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తోంది. - 8లో

అరచేతిలో ఆరోగ్యశ్రీ

ప్రజలందరికీ కార్పొరేట్ వైద్యం అందాలి.. పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన చికిత్సలు పొందాలి.. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా కల్పించాలి.. ఎలాంటి వ్యాధి బారిన పడినా వెంటనే ఆస్పత్రిలో చేరే పరిస్థితి తీసుకురావాలి.. నిరుపేదలు సైతం తమకు అండగా ప్రభుత్వం ఉందనే ధైర్యం అందించాలి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీకి మరిన్ని మెరుగులు దిద్దారు .. పథకం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచుతూ ప్రజలకు ఆరోగ్య అభయం అందించారు. ఈ క్రమంలోనే వినూత్నమైన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. సకల వివరాలను సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.



- విశిష్ట పథకంపై వినూత్న యాప్
- అందుబాటులో సమస్త సమాచారం
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న సచివాలయ, వైద్య సిబ్బంది
- కుటుంబానికి ఒక మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు
- ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశంసలు కురిపిస్తున్న ప్రజలు

డౌన్‌లోడ్ చేసుకుందాం ఇలా..
- ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ క్లిక్ చేయాలి.
- సెర్చ్‌లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ అని టైప్ చేయాలి.
- ఇన్‌స్టాల్ బటన్ క్లిక్ చేయాలి.
- ఆరోగ్యశ్రీ యాప్ డిస్‌ప్లే అవుతుంది.
- అనంతరం ఆధార్ నంబరు టైప్ చేయాలి.
- ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయగానే లాగిన్ అవుతారు.
- ఆస్పత్రులు అని ఉన్నచోట క్లిక్ చేయాలి.
- అవసరం మేరకు తర్వాత వచ్చే నాలుగు ఆప్షన్లు నింపాలి.
- ఈ క్లిక్‌తో సమీపంలోని ఆస్పత్రుల పేర్లు, ఆరోగ్య మిత్ర, కాంటాక్ట్ నంబర్ల ఐకాన్లు డిస్‌ప్లే అవుతాయి.
- అలాగే ఆస్పత్రులకు వెళ్లే మార్గం కూడా గూగుల్ మ్యాప్ ద్వారా చూపిస్తుంది.

చిత్తూరు రూరల్ : విద్య, వైద్యరంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యం కల్పించారు. అందులో భాగంగానే ప్రభుత్వాసుపత్రుల ఆధునికీకరణ, కొత్త పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పాటు వినూత్నంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వంటివి చేపట్టారు. ఈ క్రమంలోనే అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారి కోసం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు. గతంలో 1,059 చికిత్సలు మాత్రమే ఆరోగ్యశ్రీ పరిధిలో ఉండగా, ప్రస్తుతం 3,257 వ్యాధులను జాబితాలో చేర్చారు. అలాగే రూ.5లక్షల పరిమితిని రూ.25లక్షలకు పెంచడమే కాకుండా కొత్త కార్డులను సైతం యుద్ధప్రాతిపదికన ఇంటింటికీ పంపిణీ చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేకంగా యాప్‌ను కూడా ప్రభుత్వం రూపొందించింది. సామాన్యుడి అరచేతిలో అందుబాటులో ఉండేలా ఆరోగ్యశ్రీ యాప్‌ను తీర్చిదిద్దింది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేయించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు వలంటీర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందుతున్న సేవలన్నింటినీ క్షుణ్ణంగా వివరించేలా ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం శరవేగంగా సాగుతోంది.

యాప్‌తో ఎంతో మేలు...

ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. ఈ పథకం సేవల పరిధి, ఏయే వ్యాధులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించుకోవచ్చు, నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలను ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్ ద్వారానే తెలుసుకోవచ్చు. ఎవరైనా ప్రమాదాలకు గురైనా, అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నా.. యాప్ ఉంటే ఎవరి ప్రమేయమూ లేకుండానే యాప్ ద్వారా కావాల్సిన సమాచారం తెలుసుకునే వీలుంటుంది. ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన లేని వారికి సైతం పూర్తి స్థాయిలో అర్థమయ్యేలా ఈ యాప్ రూపొందించారు. ఇప్పటి వరకూ కార్డుదారు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యశ్రీ కింద పొందిన చికిత్సల వివరాలు కూడా అందులో చూసుకోవచ్చు. చికిత్స తర్వాత విశ్రాంతి సమయంలో కార్డుదారు ఖాతాలో జమయ్యే వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ఆర్థిక సహాయం మొత్తాన్ని కూడా కేసుల వారీగా తెలుసుకునే వీలుంది. చికిత్స సమయంలో కార్డుదారు పొందిన వైద్య పరీక్షల రిపోర్టులు కూడా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముంది. అలాగే ఉచితంగా చికిత్స అందించిన నెట్‌వర్క్ ఆస్పత్రికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం జమ చేసిన మొత్తం, ఇతర వివరాలను తెలుసుకోవచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,78,860 ఆరోగ్యశ్రీ కార్డుదారులుండగా, ఇప్పటి వరకు 5,14,954 మంది యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్


ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీంతో ఆరోగ్యశ్రీకి సంబంధించిన సమాచారమంతా అరచేతిలోకే వచ్చేస్తుంది. యాప్ డౌన్‌లోడ్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే లక్ష్యం చేరుకుంటాం. అందుకే నెలాఖరు వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం.
– సుదర్శన్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్, చిత్తూరు

సులభంగా సేవలు


ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడింగ్ ప్రక్రియ వేగంగా చేయిస్తున్నాం. వైద్య సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. వీలైనంత త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు చేపడుతున్నాం. ప్రజలకు సైతం ఈ యాప్‌పై అవగాహన పెంపొందించుకోవాలి. దీంతో ఆరోగ్య శ్రీ వైద్య సేవలను సులభంగా పొందవచ్చు.
– రాజశేఖర్‌రెడ్డి, ఆరోగ్య శ్రీ జిల్లా కో–ఆర్డినేటర్, తిరుపతి

గొప్ప విషయం


ఆరోగ్యశ్రీ సేవలు కూడా ఇంటి నుంచే పొందేలా చేయడం గొప్ప విషయం. యాప్‌ను వలంటీర్లు నా మొబైల్ ఫోన్‌లో డౌన్ లోడ్ చేయించారు. వాటి పనితీరు, సేవల విషయాలను వివరించారు. ఆరోగ్య రంగానికి ముఖ్యమంత్రి తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈరోజు ఎలాంటి ఖర్చు లేకుండా వైద్య సేవలు పొందుతున్నామంటే ప్రభుత్వమే కారణం.
– యుగంధర్, అశోక్‌నగర్, చిత్తూరు

ఉచితంగా వైద్యం


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ పేదల కోసమే ఆలోచింటారు. ఖరీదైన వైద్యసేవలను సైతం ఉచితంగా చేయిస్తున్నారు. గతంలో కొన్ని వ్యాధులకు మాత్రమే చికిత్సలు ఉండేవి. ఇప్పుడు చాలా వాటికి అందిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆరోగ్య శ్రీ సేవలు పొందుతున్నాం.
– సుమతి, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు

పేదలకు మేలు


ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షల పెంచడం ఆషామాషీ కాదు. ఇది పేదలకు ఎంతో మేలు చేస్తుంది.కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకోవాలంటే రూ.లక్షల్లో ఉండాలి. కానీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఇక యాప్‌తో మరింత మేలు. –మబున్నీ, బీఎన్‌ఆర్‌పేట, చిత్తూరు మండలం

ఎంతో ఉపయోగం


పేదలకు ఆరోగ్యశ్రీ పథకం వరం. ప్రజలకు ఎంతో ఉపయోగకరం. పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో మరింత బలపేతమైంది. పైసా ఖర్చు లేకుండా చిక్సిత పొందుతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో ముందుగా ఆరోగ్యశ్రీనే గుర్తుకువస్తుంది. ఇప్పుడు తీసుకువచ్చిన యాప్‌తో సులువుగా సమాచారం పొందవచ్చు.
– బేగం, బీఎన్‌ఆర్‌పేట, చిత్తూరు మండలం

ఎన్నో ప్రయోజనాలు


ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన కుటుంబాల వద్దకు వలంటీర్, ఏఎన్‌ఎం బృందం వస్తుంది. యాప్‌పై అవగాహన కల్పించి డౌన్‌లోడ్ చేయిస్తుంది. కుటుంబంలో ఒకరు అయినా తప్పనిసరిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

న్యూస్‌రీల్

అయ్యప్ప సేవలో మంత్రి పెద్దిరెడ్డి


మంత్రి పెద్దిరెడ్డికి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

సదుం : ఎర్రాతివారిపల్లెలోని కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వినాయక, ఆంజనేయ, నాగమల్లేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ, ప్రసాదాలను మంత్రి పెద్దిరెడ్డికి అందించారు. కార్యక్రమంలో నాయకులు మిద్దింటి కిషోర్, హబీబ్ బాషా, అమరనాథరెడ్డి, జిలానీసాబ్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'విదేశీ విద్యా దీవెన'
చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు కలెక్టరేట్‌లో బుధవారం జగనన్న విదేశీ విద్యాదీవెన జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జగన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకాలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో విదేశీ విద్యాదీవెన పథకానికి 10 మంది ఎంపికైనట్లు వివరించారు. సదరు విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం 1.24 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం


ఏనుగులు తొక్కేసిన వరి నారు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారిపల్లెలో పంటల పొలాలపై మంగళవారం వేకువజామున ఏనుగుల గుంపు దాడి చేసింది. పలువురు రైతుల సాగు చేస్తున్న వరి పైర్లను నాశనం చేసింది. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను కట్టడి చేయాలని బాధితులు కోరుతున్నారు.

నేడు పుత్తూరులో జాబ్ మేళా
పుత్తూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 9.30 గంటలకు మెగా జాబ్ మేళా ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవల్‌మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాను మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కాప్ జెమినీ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ఈజీఎస్ ఇన్నోవేటివ్, వైఎస్‌కే ఇన్ఫోటెక్, ఫ్లిప్‌కార్ట్, ముత్తూట్ ఫైనాన్స్, డీఫైన్ ప్రో సొల్యూషన్స్ వంటి 25 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగిన వారు మేళాకు సర్టిఫికెట్స్, ఐడీ ప్రూఫ్‌లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 6300954441 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా


వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితాను పారదర్శకంగా సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అలసత్వం వహించకుండా బీఎల్‌ఓల కసరత్తు పూర్తి చేయాలన్నారు. బీఎల్‌ఓలు ధ్రువీకరించిన ఓటరు దరఖాస్తులను ఏఈఆర్‌ఓ, ఈఆర్‌ఓ క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో రిసెప్షన్, డిస్పాచ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల నివేదికలను వెంటనే కలెక్టరేట్‌కు పంపాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న క్రీడా పోటీల ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే ఇందుకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశామన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా సంక్షేమం

కార్వేటినగరం : చరిత్రలో నిలిచేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. మంగళవారం మండలంలోని ద్వారకానగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పథకాలను ప్రవేశపెట్టడమే కాకుండా అవినీతికి తావులేకుండా క్షేత్రస్థాయిలో అర్హులందరికీ ఫలాలు అందిస్తుండడం వల్లే జగనన్నకు జనం జేజేలు పలుకుతున్నారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఓటమి భయంతోనే ఇప్పుడు పొత్తుల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ అస్సలు రాజకీయ అనుభవం లేని పవన్‌కల్యాణ్ ముందు మోకరిల్లడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఎంతమందితో పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వచ్చినా జగనన్న చేతిలో చంద్రబాబు మళ్లీ ఘోర పరాభవం తప్పదని స్పష్టం చేశారు. 2024 ఎన్నికలలో టీడీపీ భూస్థాపితం కావడం తథ్యమన్నారు. అనంతరం పాత దేరాకండ్రిగకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మోహన్‌రెడ్డిని పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయనకు ప్రభుత్వంతోపాటు వ్యక్తిగతంగానూ జీవితాంతం అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ధనశేఖర్‌యాదవ్, సర్పంచ్ పెరియస్వామిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మయ్య పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నేతను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

క్రిస్మస్..సంక్రాంతి కానుక సిద్ధం



దుస్తుల కిట్‌ను పరిశీలిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీన క్రిస్మస్, సంక్రాంతి కానుక పంపిణీ చేసేందుకు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సర్వం సిద్ధం చేశారు. చిత్తూరు నియోజకవర్గంలోని 53 వేల మంది మహిళలకు చీర, జాకెట్, వారి భర్తలకు ఫ్యాంట్ షర్ట్‌తో కలిపి కుట్టు కూలీ అందించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. అయ్యప్ప గార్డెన్ వేదికగా కానుక పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఈమేరకు ఏర్పాట్లను విజయానందరెడ్డి పరిశీలించారు.

22 నుంచి కలెక్టర్లకు శిక్షణ
చిత్తూరు కలెక్టరేట్ : ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ఈ నెల 22 ,23 తేదీల్లో కలెక్టర్లకు విజయవాడలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు 21న కలెక్టర్ షణ్మోహన్ విజయవాడకు బయలుదేరనున్నారు. ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ శ్రీనివాసులు వ్యవహరించనున్నారు.

జగనన్నతోనే సమగ్రాభివృద్ధి



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

నగరి : రాష్ట్ర సమగ్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. మంగళవారం పట్టణంలోని కొత్తపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. మంత్రి రోజా ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పించిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారని వివరించారు. కొత్తపేట సచివాలయ పరిధిలోనే రూ.29.41 కోట్ల మేర సంక్షేమ ఫలాలు అందించామని వెల్లడించారు. 208 మందికి ఇళ్ల నిర్మాణానికి సాయం చేశామన్నారు. 733 మందికి పెన్షన్, 447 మందికి అమ్మ ఒడి అందిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బీఆర్‌వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు చిత్ర, ఎంఎం కామాక్షి, భూపాలన్, ఇంద్రయ్య, నాయకులు ఇళంగో, సతీష్, జానకిరామ్, శశి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

బీఎల్‌ఓ సస్పెన్షన్

నగరి : ఎలక్టోరల్ విధులకు హాజరుకాకుండా అలసత్వం వహించిన బీఎల్‌ఓ శ్రీనివాసులుపై వేటు పడింది. నింద్ర మండలం శ్రీరామాపురం బీఎల్‌ఓగా పనిచేస్తున్న కావనూరు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసులు బాధ్యతారహితంగా వ్యవహరించడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఆర్డీఓ సుజన మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

వంచనకు కేరాఫ్ చంద్రబాబు



రెడ్డెమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్

బైరెడ్డిపల్లె : వంచనకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబునాయుడని డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ ఆరోపించారు. మంగళవారం బైరెడ్డిపల్లెలో ఆమె మీడియాతో మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు గుప్పించిన హామీలను నమ్మి 30లక్షల మంది డ్వాక్రా మహిళలు బ్యాంక్ డిఫాల్టర్లుగా మారారని వెల్లడించారు. పొదుపు మహిళల రుణాలను మాఫీ చేస్తామని, బ్యాంకుల్లో పెట్టిన బంగారు నగలను విడిపిస్తామని మభ్యపెట్టి తీరా అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. దీంతో రుణాలకు వడ్డీ రెట్టింపు కావడంతో పొదుపు మహిళలు చెల్లించలేకపోయారన్నారు. కొందరు ఆస్తులు అమ్ముకుని రుణాలు చెల్లించాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పావలా వడ్డీ పథకం ప్రవేశపెట్టారని వెల్లడించారు. అప్పుడు ఏర్పాటైన చిన్న తరహా పరిశ్రమలే, ప్రస్తుతం భారీ పరిశ్రమలుగా రూపాంతరం చెందాయని తెలిపారు. వైఎస్సార్ బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం పొదుపు రుణాలను నాలుగు విడతలుగా చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. అందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు.

వరసిద్ధుని సేవలో అపోలో చైర్మన్



ఆలయంలో అపోలో చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కుటుంబం సమేతంగా సేవించుకున్నారు. మంగళవారం ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు.

ఘనంగా 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'



మాట్లాడుతున్న ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక ఎస్వీ సెట్‌లో మంగళవారం ఘనంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ నిర్వహించారు. ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ టెక్నికల్ ఎడ్యుకేషన్) చైర్మన్ ప్రొఫెసర్ సీతారామ్ మాట్లాడుతూ అందుబాటులోకి సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. హ్యాకథాన్‌కు దేశంలోని పలు కళాశాల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ హ్యాకథాన్‌కు తమ కాలేజీ వేదిక కావడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో వివిధ కళాశాలకు చెందిన 199 మంది విద్యార్థులతో కూడిన 29 జట్లు వివిధ ఆవిష్కరణలతో పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోహన్‌బాబు, డైరెక్టర్ సుదర్శన్, వైస్ ప్రిన్సిపల్ లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్–2 శిక్షణకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : గ్రూప్–2 పరీక్షలకు సంబంధించి గిరిజన అభ్యర్థులకు ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారికి ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు వెల్లడించారు. డిగ్రీ పూర్తి చేసిన గిరిజన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ భవనంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీలోపు సమర్పించాలని సూచించారు. వివరాలకు 8187899877 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అభ్యసన 'మెరుగు'!

- 21న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ట్యాబ్‌ల పంపిణీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు


మొదటి ఏడాదిలో అందుకున్న ట్యాబ్‌లతో తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: పేద విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యనందించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇందులో భాగంగానే గత ఏడాది నుంచి 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఈ విద్యాసంవత్సరంలోనూ అదేవిధంగా ట్యాబ్‌లు పంపిణీ చేయడానికి చర్యలు వేగవంతం చేసింది. ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. చిత్తూరు జిల్లాలోని 352 ఉన్న పాఠశాలలతోపాటు తిరుపతి జిల్లాల్లోని 622 పాఠశాలల్లో మొత్తం 34,452 ట్యాబ్‌లను ఉచితంగా విడతల వారీగా అందించనుంది.

ఆఫ్‌లైన్‌లోనూ వీడియో పాఠ్యాంశాలు

8వ తరగతి విద్యార్థులు ఈ ట్యాబ్‌ల ద్వారా నిర్వహించే అభ్యసనాన్ని పర్యవేక్షించేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ట్యాబ్‌కు ఒకసారి చార్జింగ్ పెడితే 10 గంటలపాటు బ్యాటరీ బ్యాకప్ ఉంటుంది. ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండా ఆఫ్‌లైన్‌లో వీడియో పాఠ్యాంశాలను అభ్యసించేలా ప్రీలోడెడ్ కంటెంట్‌తో ఈ ట్యాబ్‌లను అందిస్తారు. మూడేళ్ల పాటు వీటికి వారెంటీ ఉంటుంది. పదో తరగతి వరకు విద్యార్థులు ఈ ట్యాబ్‌ల ద్వారా పాఠాలు నేర్చుకోవచ్చు. మధ్యలో ట్యాబ్‌ల్లో ఏదైనా సమస్య వచ్చినా సరఫరా చేసిన సంస్థ తిరిగి సరిచేసి ఇస్తుంది. పిల్లలను పక్కదారి పట్టించే ప్రమాదకర వెబ్‌సైట్‌లు ఓపెన్ కాకుండా ప్రత్యేకమైన లాకింగ్ వ్యవస్థను కూడా ట్యాబ్‌ల్లో ఏర్పాటు చేశారు. సిమ్ స్లాట్‌ను లాక్ చేసి ఉంచుతారు. ఆఫ్‌లైన్‌లో మాత్రమే బైజూస్ యాప్ ఓపెన్ అయ్యే విధంగా ఏర్పాటు చేశారు. గూగుల్ వంటివి ఓపెన్ అయినా వాటిలో కేవలం విద్యార్థులు అదనపు సబ్జెక్టు అంశాలను నేర్చుకోవడానికే అవకాశం ఉంటుంది.

ఫిర్యాదుకు అవకాశం

ట్యాబ్‌లలో ఏవైనా లోపాలుంటే సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదుల ఆధారంగా నిర్ణీత గడువులోపు సంబంధిత ట్యాబ్‌లను సరిచేసి ఇస్తారు. విద్యార్థులకు అందించే ఒక్కో ట్యాబ్ 8.7 అంగుళాల టచ్ స్క్రీన్, 3 జీబీ ర్యామ్, 32 జీబీ రోమ్ కలిగి ఉంటుంది. సరఫరా చేసిన 30 రోజుల్లోగా ట్యాబ్‌లో లోపాలుంటే దాని స్థానంలో కొత్త ట్యాబ్‌ను అందజేస్తారు. ట్యాబ్‌లో రిపేరు వస్తే ఏడు రోజుల్లోగా సరిచేసి ఇవ్వాలనే నిబంధన విధించారు.

భారం లేకుండా..

చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు, టీచర్లకు గత ఏడాది 21,487 మందికి, తిరుపతి జిల్లాలో 21,022 మందికి ట్యాబ్స్‌ను బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వం పంపిణీ చేసింది. భౌతిక నష్టం (ఫిజికల్ డ్యామేజీ) మినహా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తితే ఎలాంటి ఖర్చు లేకుండా సరిచేసి ఇచ్చేలా మూడేళ్ల వారంటీతో వీటిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. స్క్రీన్ పగిలిపోయిన వాటికి కొత్తవి అమర్చాలంటే కనీసం రూ.5 వేల వరకు ఖర్చవుతుంది. ఇంత భారం విద్యార్థుల తల్లిదండ్రులపై పడకూడదనే ఉద్దేశంతో ఆ ఖర్చును ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించింది.

21న రెండో విడత ట్యాబ్‌ల పంపిణీ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 21న చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. ఈ రెండు జిల్లాల్లో మొత్తం 10,991 ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. కసరత్తును చిత్తూరు జిల్లా పరిధిలో కలెక్టర్ షణ్మోహన్, తిరుపతి జిల్లా పరిధిలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.


చిత్తూరు జిల్లాలో ఎంఈఓలకు ట్యాబ్‌లను అందజేస్తున్న సిబ్బంది

చిత్తూరు జిల్లాలో ట్యాబ్‌ల పంపిణీ ఇలా

నియోజకవర్గం	8వ తరగతి విద్యార్థులు	పంపిణీ చేసే ట్యాబ్‌లు
చిత్తూరు	1,631	340
జీడీ నెల్లూరు	1,830	1,012
కుప్పం	3,762	680
నగరి	1,289	510
పలమనేరు	3,989	850
పుంగనూరు	2,877	1,020
పూతలపట్టు	1,977	850
మొత్తం	17,355	5,262


తిరుపతి జిల్లాలో మండలాలకు ట్యాబ్‌లను సరఫరా చేస్తున్న బైజూస్ నోడల అధికారి సురేష్

తిరుపతి జిల్లాలో ట్యాబ్‌ల పంపిణీ ఇలా

నియోజకవర్గం	8వ తరగతి విద్యార్థులు	పంపిణీ చేసే ట్యాబ్‌లు
చంద్రగిరి	2,030	969
గూడూరు	2,642	850
నగరి	963	340
సత్యవేడు	2,774	1,190
శ్రీకాళహస్తి	2,736	680
సూళ్లూరు పేట	2,824	1,020
తిరుపతి అర్బన్	1,716	170
వెంకటగిరి	1,412	510
మొత్తం	17,097	5,729

సక్రమంగా వినియోగించాలి



విద్యార్థులు విజ్ఞానవంతులుగా ఎదగాలని, వారికి ఉత్తమ భవిష్యత్ అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ట్యాబ్స్‌ను అందిస్తోంది. వాటిని సక్రమంగా వాడుకోవాలి. సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించేందుకు యంత్రాంగం కూడా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇబ్బందులుంటే స్థానిక సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేసి సరిచేసుకోవచ్చు.
– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు జిల్లా

ట్యాంపర్ చేస్తే ఐటీ సెల్‌కు అలర్ట్



ఈ ట్యాబ్‌లు ప్రత్యేకంగా రూపొందించారు. వీటిల్లోని కంటెంట్ ఇంటర్నెట్ లేకుండానే వినియోగించుకోవచ్చు. సబ్జెక్టుల వారీగా ఉన్న పాఠ్యాంశాలను విద్యార్థి ఎన్ని గంటలు చూశారు, ఏ సబ్జెక్టు కోసం ఎక్కువ సమయం కేటాయించారో అందులో నమోదవుతుంది. ట్యాబ్స్‌ను నెట్(వైఫై)కు అనుసంధానం చేయగానే మొత్తం వివరాలు స్టేట్ ఐటీ సెల్‌కు చేరుతాయి.
– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

నవశకానికి నాంది



ప్రభుత్వం విద్యారంగంలో నవశకానికి నాంది పలికింది. విద్యార్థుల అవసరాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చర్యలు చేపడుతోంది. చిత్తూరు జిల్లాలో ఈ నెల 21న రెండో ఏడాది ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు మొదటి దశలో వచ్చిన ట్యాబ్‌లను 31 మండలాలకు పంపిణీ చేశాం.
– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

అభ్యసన మెరుగుకు దోహదం



అభ్యసనకు ట్యాబ్‌లు ఎంతగానో దోహదం చేస్తాయి. తిరుపతి జిల్లా పరిధిలో మొదటి దశలో అందజేసిన ట్యాబ్‌ల వల్ల విద్యార్థుల సామర్థ్యాలు పెరిగాయి. ఈ విధానం వల్ల విద్యార్థుల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడటమే కాకుండా, భవిష్యత్‌లో దేశ, విదేశాల్లో బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.
– శేఖర్, డీఈఓ, తిరుపతి

క్లుప్తంగా

పేయదూడల ప్రదర్శన


ఆవులను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

శ్రీరంగరాజపురం: మండలంలోని నెళవాయి పంచాయతీ కొండేపల్లిలో మంగళవారం సంకరజాతి పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. పశు సంవర్ధకశాఖ డీడీ గోవిందయ్య మాట్లాడుతూ పాడిరైతులు మేలురకం పేయదూడల పెంపకంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అధిక పాల దిగుబడిని అందించే రకాలను ఎంచుకోవాలని సూచించారు. కోడెదూడలపై నిర్లక్ష్యం చూపకుండా వాటి పోషణపై ఆసక్తి చూపించాలని కోరారు. మేలు జాతి కోడెదూడలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీటీపీ డీడీ వాసు, అడిషనల్ డీడీ పద్మావతి, ఏడీ రూపసుందరి, పశువైద్యాధికారులు విద్య, నందిని, పర్యవేక్షకుడు సుధాకర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కుప్పం విద్యార్థి


సత్తా చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుప్పంరూరల్ : జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌కు మండలంలోని టి.సదుమూరు పాఠశాల విద్యార్థి కె.ధనుష్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరాజు తెలిపారు. నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–17 త్రోబాల్ పోటీల్లో ధనుష్ ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు వెల్లడించారు. అలాగే నిత్యశ్రీ అనే విద్యార్థి ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. మరో ఐదుగురు విద్యార్థులు సైతం అద్భుతంగా రాణించినట్లు వివరించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 61,499 మంది స్వామివారిని దర్శించుకోగా 24,789 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బెట్టింగ్‌కు యువకుడి బలి


వెంకటేష్ (ఫైల్)

పుంగనూరు : ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాడు పడి రూ.లక్షల అప్పులు చేసి తీర్చలేక ఓ యువకుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన వెంకటేష్ (24) తన మేనమామ భాస్కర్ ఇంట్లో ఉంటున్నాడు. అతడి తండ్రి బంగారుపాళ్యెంలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు అలవాటు పడిన వెంకటేష్ సుమారు రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. జూదంలో నగదు పోతుండడంతో అప్పులు తీర్చడం కష్టమై ఇంట్లో ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబీకులు వెంటనే వెంకటేష్‌ను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు.

నగరిలో రాధాకృష్ణ, రామోజీ నిల్చుంటారా?

- మంత్రి ఆర్‌కే రోజా ధ్వజం


తిరుమల ఆలయం వెలుపల మంత్రి ఆర్కే రోజా

తిరుమల: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 కి 175 సీట్లు పక్కాగా గెలుస్తుందని మంత్రి ఆర్‌కే రోజు ధీమా వ్యక్తం చేశారు. ఆమె మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి రోజా మీడియాతో మాట్లాడుతూ తాను నగరి నియోజకవర్గంలో రోజూ గడపగడపకు వెళుతూ పల్లెనిద్ర చేస్తున్నానని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో ముందుంటున్నానన్నారు. అందుబాటులో ఉన్నాం కాబట్టే రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రినయ్యానని చెప్పారు. నగరిలో రోజాకు సీటు లేకుంటే రాధాకృష్ణ నిల్చుంటాడా.. రామోజీరావు నిల్చుంటాడా.. అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో నిలబడడానికే భయపడుతున్నారన్నారు. నగరిలో ఎవరికి టికెట్ ఇచ్చినా.. తాను జగన్ అన్నకు తోడుగా ఉంటానని రోజా స్పష్టం చేశారు. తనకు ఎమ్మెల్యే సీటు లేదనే ప్రచారం కేవలం శునకానందమేనని అన్నారు. పచ్చ మీడియా దిగజారుడు వార్తలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి 100 శాతం పనిచేస్తామని ఆమె స్పష్టం చేశారు.

కిడ్నాపర్ అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామకుప్పం: బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. వివరాలు.. వి.కోట మండలం ముద్దిరాళ్లకు చెందిన సుబ్రమణ్యం, నక్కనపల్లెకు చెందిన హరీష్‌రెడ్డి మధ్య విభేదాలు ఉన్నాయి. ఈక్రమంలో సోమవారం ఉదయం 9 గంటలకు రామకుప్పం సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏడో తరగగతి చదువుతున్న సుబ్రమణ్యం కుమారుడు సుదర్శన్‌మౌర్యను హరీష్‌రెడ్డి కిడ్నాప్ చేశాడు. దీనిపై సుబ్రమణ్యం వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో కెంపసముద్రం సమీపంలోని అంజనేయస్వామి ఆలయం వద్ద హరీష్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తిరుచానూరులో భారీ చోరీ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలో భారీ చోరీ చోటు చేసుకుంది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు బంగారంతో పాటు నగదును దోచుకెళ్లిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుచానూరు పరిధిలోని వీవీ నగర్‌కు చెందిన ఖాదర్‌వల్లీ ఉల్లిపాయల హోల్‌సేల్ వ్యాపారి. సోమవారం రాత్రి ఖాదర్‌వల్లీతో పాటు కుటుంబ సభ్యులు మొదటి అంతస్తులో నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దొంగలు ఇంటి తలుపులను బద్దలకొట్టి అక్రమంగా ఇంట్లోకి చొరబడి పడకగదిలోని బీరువా వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న తాళాలతో బీరువను తెరిచి అందులోని సుమారు 500 గ్రాముల బంగారు ఆభరణాలు, పెద్ద మొత్తంలో నగదును దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంట్లోకి వచ్చి చూడగా తలుపులు బద్దలు కొట్టినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన క్లూజ్ టీం అధికారులు వేలిముద్రలు సేకరించారు. క్రైం డీఎస్పీ, సీఐలతో పాటు తిరుచానూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాత్‌రూంకు వెళ్లి.. బక్కెట్‌లో పడి!

- నారాయణ స్కూల్ పీఈటీ మృతి


నటరాజన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి రూరల్: బాత్‌రూమ్‌కు వెళ్లిన ఓ టీచర్ మూర్ఛ రావడంతో బక్కెట్‌లో తల పడి మృతిచెందిన ఘటన తిరుపతి రూరల్ మండలం, కాలూరులోని నారాయణ స్కూల్లో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి కథనం.. చౌడేపల్లి మండలం, కుద్రపల్లికి చెందిన నటరాజన్(28) బీఎస్సీ, బీపీఈడీ పూర్తి చేసుకుని పీఈటీగా పనిచేస్తున్నాడు. తిరుపతి రూరల్ మండలం, కాలూరులోని నారాయణ బాయ్స్ స్కూల్లో గత ఆరు ఏళ్లుగా పీఈటీగా ఉన్నారు. మంగళవారం ఉదయం బాత్ రూమ్‌కు వెళ్లిన నటరాజన్ లోపల గడి పెట్టుకుని ఉన్నాడు. సాయంత్రం అయినా కనిపించకపోవడంతో హాస్టల్‌లో వెదికారు. బాత్‌రూం లోపల గడిపెట్టి ఉండడంతో పగలగొట్టి చూడగా బాత్‌రూంలో ఉన్నప్పుడు ఫిట్స్ రావడంతో తలను కిందకు వంచడం, అదే సమయంలో అక్కడ బక్కెట్ ఉన్నట్లు గుర్తించారు. స్కూల్ యాజమాన్యం తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించింది. సీఐ సుబ్రమణ్యం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు.

న్యూఇయర్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ ఈఓ వెంకటేశు, అడిషనల్ ఎస్పీ సుధాకర్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈఓ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి కాణిపాకానికి ప్రత్యేక బస్సులు నడపాలను ఆర్టీసీ అధికారులకు సూచించారు. సమావేశంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటిండెంట్ కోదండపాణి, వాసు, సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఎంపీడీఓ నాగరాజు పాల్గొన్నారు

వరసిద్ధునికి విరాళం


గో సంరక్ష ట్రస్ట్‌కు, నిత్యాన్న దానానికి విరాళామిస్తున్న మనోజ్‌కుమార్ కుటుంబ సభ్యులు

వినాయకస్వామి ఆలయంలోని గో సంరక్షణ ట్రస్ట్‌కు హైదరాబాద్ నిజాంపేట్‌కు చెందిన మనోజ్‌కుమార్, కుటుంబసభ్యులు రూ. 2.16 లక్షలు, నిత్యాన్నదానానికి రూ. 1.16 లక్షలు మొత్తం రూ.3.32 లక్షలను విరాళంగా అందజేశారు. దాతలకు అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

ఓటు.. గ్రేటు



ప్రజల వజ్రాయుధం ఓటు.. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి.. బీఎల్‌ఓలు ఆ మేరకు అవగాహన కల్పించాలి.. ఓటు విలువను అందరూ గుర్తెరగాలి.. అంటూ ఈఆర్‌ఓ శివయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పూతలపట్టులో విద్యార్థులు, అధికారులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, డీటీ మహేశ్వరి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, నాయకులు అమరనాథ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పాల్గొన్నారు.
- పూతలపట్టు

వృద్ధురాలిపై లైంగిక దాడి

పలమనేరు: మండలంలోని మండిపేట కోటూరుకు చెందిన వృద్ధురాలు (67) ఆదివారం బహిర్భూమికి వెళుతుండగా హరీష్(25) అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. వైద్యపరీక్షల నిమిత్తం వృద్ధురాలిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట: ఐటీడీఏ ప్రాజెక్టు– నెల్లూరు పరిధిలోని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్టు నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ మందరాణి మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నోటిఫికేషన్‌లో జేఎల్(ఫిజిక్స్)01 (ఎస్సీ మహిళ), జేఎల్ (కెమిస్ట్రీ)01 (ఎస్సీ మహిళ), పీజీటీ, సోషియల్ స్టడీస్–01 (ఎస్సీ, మహిళ), అర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ 01 (ఓసీ, పీహెచ్‌సీ మహిళ) మొత్తం నాలుగు పోస్టులను తాత్కాలిక ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. జేఎల్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో సెకండ్ క్లాస్ మార్కులతో ఉత్తీర్ణత, బీఈడీ ఆయా సబ్జెక్టులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉందన్నారు. అర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ పోస్టుకు 10వ తరగతి పాసై, ఆర్ట్ కోర్సులో డిప్లొమా హయ్యర్ గ్రేడ్ డ్రాయింగ్ టీచర్ సర్టిఫికేట్, సంబంధిత ట్రేడ్ జారీచేసిన ఐటీఐ ట్రేడ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు కనీసం రెండు స్థాయిలలో ఇంగ్లిస్ మీడియం చదివి ఉండాలని తెలిపారు. ఏపీ టెట్ ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు అన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న గిరిజన గురుకుల విద్యాలయాల్లో లభిస్తాయని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 22వ తేదీ సాయంత్రం 5గంటల లోపు రేణిగుంట ఎయిర్‌పోర్ట్ మార్గంలోని గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈనెల 30వ తేదీన ఉదయం 10గంటలకు అభ్యర్థులకు అదే పాఠశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.